## 19075 కింద ముగిస్తే

# మరింత దిద్దుబాటు




**సమీక్ష:** గతవారం సెన్సెక్స్ 458 పాయింట్ల నష్టాన్ని చవిచూసింది. సంవత్సరాంతాన విదేశీ సంస్థాగత మదుపుదార్ల(ఎఫ్ఐఐ) నుంచి ఎదురైన విక్రయాల ఒత్తిళ్లు ఇందుకు ప్రధాన కారణం. అంతర్జాతీయ మార్కెట్లు బలహీనంగా ఉండడం, దేశీయ మార్కెట్ల నుంచి ప్రతికూల వార్తలు రావడంతో మార్కెట్లో లాభాలకు అడ్డుకట్ట పడింది. బ్యాంకుల డిపాజిట్ రేట్ల పెంపు, పెట్రో ధరల పెంపుపై అంచనాలు సెంటిమెంటును బలహీనపరచాయి. దీంతో మధ్య, చిన్న స్థాయి షేర్లలో భారీ విక్రయాలు జరిగాయి. 2జీ కుంభకోణం వంటి ప్రతికూల వార్తల నేపథ్యంలో ఎంపిక చేసిన షేర్లలో ఎఫ్ఐఐలు లాభాల స్వీకరణ చేశారు. అయితే శుక్రవారం అంచనాలకు మించి వెలువడ్డ పారిశ్రామికోత్పత్తి గణాంకాలు కాస్త కాపాడాయి.

**ఎఫ్ఐఐల తీరు:** ఎఫ్ఐఐలు రూ.2295 కోట్ల నికర విక్రయాలు చేయగా.. మ్యూచువల్ ఫండ్లు సైతం రూ.421 కోట్ల అమ్మకాలు జరిపాయి.

**రంగాల వారీగా:** వడ్డీ రేట్లతో ప్రభావితమయ్యే బ్యాంకింగ్, స్థిరాస్తి షేర్లకు పెద్ద ఎత్తున అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. రిజర్వు బ్యాంకు తన ద్రవ్యవిధాన సమీక్షలో కఠిన వైఖరి అవలంబించొచ్చన్న అంచనాలు ఇందుకు కారణం. ఇక మన్నికైన వినిమయ వస్తువులు మరో వారం డీలా పడ్డాయి. డాలరు మారకపు విలువ బలోపేతం కావడంతో ఐటీ షేర్లు లాభాలను కళ్లజూశాయి. ఇంధన ధరల పెంపు అంచనాలతో చమురు, సహజవాయువు షేర్లు మదుపర్లను ఆకర్షించాయి.

**విస్తృతి:** లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 2:1గా నమోదు కావడం చూస్తే మధ్య, చిన్న స్థాయి షేర్లు భారీగా నష్టపోయిన తర్వాత ఎంపిక చేసిన షేర్లలో బాటమ్ ఫిషింగ్ జరిగిందని చెప్పవచ్చు.

**ఈ వారంపై అంచనాలు:** క్రితం వారం సెన్సెక్స్ కీలకస్థాయి 20,060ను అధిగమించడంలో విఫలమైంది. దీంతో అధిక స్థాయిల వద్ద నిరోధం ఎదుర్కోవచ్చు. స్వల్పకాలంలో దేశీయ వార్తలపై ఆధారపడి సెన్సెక్స్ చలించే అవకాశం ఉంది. మార్కెట్‌కు తక్షణ మద్దతు 19075 వద్ద ఉంది. ఒక వేళ ఈ స్థాయి కంటే దిగువకు వస్తే మాత్రం తదుపరి కీలక మద్దతు స్థాయి, 200 రోజుల చలన సగటు అయిన 18364 వరకూ దిద్దుబాటు జరగవచ్చు.

కార్పొరేట్ ముందుస్తు పన్ను గణాంకాల కారణంగా ఎంపిక చేసిన షేర్లలో కదలికలు ఉండవచ్చు. టోకు ధరల సూచీ(డబ్ల్యూపీఐ)పై ఆధారపడే నెలవారీ ద్రవ్యోల్బణ గణాంకాలనూ మార్కెట్ దగ్గరగా పరిశీలించవచ్చు. ద్రవ్యోల్బణం పెరిగితే సెంటిమెంటు బలహీనపడే అవకాశం ఉంది. 16న జరిగే ఆర్‌బీఐ సమీక్ష సైతం మార్కెట్ దిశను నిర్దేశించవచ్చు. ఎఫ్ఐఐలు సంవత్సరాంత లాభాల స్వీకరణను కొనసాగిస్తే మార్కెట్లో ప్రతికూలతలు కనిపించవచ్చు.

**తక్షణ మద్దతు స్థాయిలు:** 19075, 18845, 18541; **తక్షణ నిరోధ స్థాయిలు:** 19824, 1994, 20267

**19075 కంటే కింద ముగిస్తే మార్కెట్లో బలహీనతలు కొనసాగొచ్చు.**

*– సతీశ్ కంతేటి, జెన్ మనీ*